# ఓ ఖైదీ వీరగాథ



**Oscar Wilde's** The Ballad of Reading Gaol

# ఓ ఖైది వీర గాథ

The Ballad of Reading Gaol

**Oscar Wilde**



అను సృజన:

**అశ్వినీ కుమార్**

# ఓ ఖైదీ వీరగాథ (The Ballad of Reading Gaol - *Oscar Wilde*)

**© వల్లభనేని అశ్వినీకుమార్**

శ్రీ విజయ నామ సంవత్సరం
ఉగాది, 2013

*కాపీలు:* 2000

*ముఖచిత్ర పరికల్పన:*
**సి. రమేశ్ ; జి. షాన్**

*ప్రతుల కొరకు:*
ఫోన్ : 9393436969

**మినిమి** కార్యాలయం : 9949516567

**ISBN : 978-81-927170-0-5**

*ముద్రణ:*
**కళాజ్యోతి ప్రాసెస్ ప్రై. లిమిటెడ్**
1-1-60/5,
ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
ముషీరాబాద్
హైదరాబాద్ - 500 020
ఫోన్ : 040-27645536

# ఎవ్వరిది ఈ వీరగాథ ?

**పం**దొమ్మిదవ శతాబ్ది చివరి దశాబ్దాలలో ఇంగ్లీషు సాహిత్యాకాశాన తళుక్కుమన్న తోకచుక్క ఆస్కార్ ఫింగల్ ఓఫ్లాహెర్టి విల్స్ వైల్డ్ (1856–1900). జననం ఐర్లండ్ రాజధాని డబ్లిన్‌లో. తల్లికి రచయిత్రిగా పేరుంది. ఆక్స్‌ఫర్డ్‌లో చదువుతున్నపుడు జాన్ రస్కిన్, వాల్టర్ పీటర్ కళాసిద్ధాంతాలతో ప్రభావితుడయ్యాడు వైల్డ్.

వైల్డ్ పలు వ్యాసాలు, నాటకాలు, కథలు, ఒక నవలతో తన అభిప్రాయాలను ప్రచారం చేశాడు. నైతికతకూ, కళకూ సంబంధంలేదన్నది ఈయన విశ్వాసం. కథకుడిగా, కవిగా వైల్డ్‌కు కొంత గుర్తింపు వచ్చినా, 1892 నుండే బ్రిటిష్ రంగస్థలం మీద సంచలనం సృష్టించిన నాటకాలు, 'Lady Windermere's Fan', 'A woman of no importance', 'An ideal Hunsband', 'Importance of being Earnest' లతో కీర్తి, డబ్బూ లభించాయి.

***

1892లో లార్డ్ ఆల్ఫ్రెడ్ డగ్లస్, ఆస్కార్ వైల్డ్, ఇద్దరూ ప్రేమికుల్లాగే కలసి తిరిగారు. ఇది అసహజంగా భావించిన యిరుపక్షాల హితైషులూ వెంటనే ఈ సంబంధాన్ని తెంచుకోమని సూచించారు... ఆల్ఫ్రెడ్ తండ్రి, మార్క్వెస్ ఆఫ్ క్వీన్స్‌బెరీ, కొడుకును తీవ్రంగా మందలించాడు. ఈ స్నేహం మానుకోకపోతే, పరిణామాలు తీవ్రంగా వుంటాయని హెచ్చరించాడు. ముఖ్యంగా, పెద్దకొడుకు వైకౌంట్ డ్రమ్‌లార్నింగ్ మరణం తర్వాత ఆయన బెంగ మరింత ఎక్కువై మాట వినకపోతే, ఆల్ఫ్రెడ్‌కు అలవెన్స్, భత్యం, ఆపేస్తానన్నాడు. అయినా కొడుకు, ఆయన మాట లెక్క చెయ్య లేదు. మార్క్వెస్ ఆఫ్ క్వీన్స్‌బెరీ, ఆస్కార్ వైల్డ్ వెంటపడి వేధించడం మొదలుపెట్టాడు. ఆస్కార్ వైల్డ్ ని sodomite అని తిట్టాడు.

ఈ అవమానాన్ని భరించలేని వైల్డ్, ఆల్ఫ్రెడ్ ప్రోత్సాహంతో క్వీన్స్‌బెరీ మీద పరువు నష్టం దావా వేశాడు. విచారణ ప్రారంభమైన తర్వాత వైల్డ్ తన అభియోగాన్ని వెనక్కు తీసుకున్నాడుగాని, క్వీన్స్‌బెరీ ఆరోపణలో నిజముందని తీర్పు చెప్పాడు జడ్జి. అధికారులు వెంటనే వైల్డ్‌కు అరెస్ట్ వారెంట్ జారీ చేశారు. ఇతర పురుషులతో అసభ్యకరంగా

ప్రవర్తించాడని కోర్టు తీర్మానించింది... వైల్డ్, ఆరోపణలన్నీ నిరాకరించాడు. తాను అసహజమైన పనులేమీ చేయలేదని వాదించాడు. కోర్టువారు, జ్యూరీ కూడా ఒక నిర్ణయానికి రాలేకపోయారు. పునర్విచారణ ప్రారంభమైంది. మూడు సార్లు విచారణ తరువాత చివరికి రెండేళ్ళపాటు వైల్డ్‌కు కఠిన కారాగార శిక్ష విధించబడింది... ఆస్కార్ వైల్డ్ లాంటి ప్రతిభావంతుడు శతాబ్దకాలం ముందుగా పుట్టి తప్పు చేశాడా? అని ఇప్పుడు మనకు అనిపించక మానదు.

పెంటన్ విల్, వాండ్స్‌వర్త్, రీడింగ్ జైళ్ళల్లో వివిధ సమయాల్లో వైల్డ్‌ను నిర్బంధించారు. అక్కడ చాలీచాలని ఆహారం, శారీరక శ్రమ, దారుణమైన పరిస్థితులతో అతని ఆరోగ్యం పాడైంది. ఆకలి, నిద్రలేమి, యితర వ్యాధులు అతణ్ణి మరింత కుంగదీశాయి.

రీడింగ్ జైలులో వున్నపుడు ఆస్కార్ వైల్డ్‌తో పాటు అక్కడ ఉరి శిక్షకు సిద్ధమవుతున్న ఖైదీ తారసపడతాడు. అతని వీరోచిత ప్రవర్తన ఆస్కార్ వైల్డ్‌ని ఆశ్చర్య పరుస్తుంది. 7-7-1896 నాడు, భార్యను హత్య చేశాడనే నేరానికి, ఒక ముప్ఫై ఏళ్ల యువకుణ్ణి ఉరి తీస్తారు. ఇది చూసి, చలించి పోయిన వైల్డ్ "Yet each man kills the thing he loves" అంటూ తన Ballad of Reading Gaol ను ప్రారంభించాడు.

ఉరికంబం ఎక్కబోతున్న వాడి 'బాధను'-ఉరితీసే వారి ఘాతుకాన్ని-చట్టాల లొసుగులను తెలియజేస్తూ తనదైన శైలిలో The Ballad of Reading Gaol రాశాడు.

1898లో కవి పేరు 'C.3.3.' గా యిది ప్రచురించబడింది. (Cell Block C: Landing 3; Cell 3.) దీని ఏడవ ముద్రణ (1899) దాకా వైల్డ్ యిది రాశాడని ఎవరికీ తెలియదు. ఈ Ballad లోని

*And alien tears will fill for him*
*Pity's long broken urn*
*For his mourners will be outcast men*
*And out casts always mourn...*

అనే చరణాలు వైల్డ్ సమాధి ఫలకం మీద ఇప్పటికీ దర్శనమిస్తాయి.

ఇది రీడింగ్ జైలులోనే రాశాడు. దీని తర్వాత De Profundis తన శిక్షాకాలం చివరి మూడు నెలల్లో రాసి-రాస్‌కు పంపమంటాడు.

- ముక్తవరం పార్థసారథి.

# ఓ ఖైదీ వీర గాథ

(The Ballad of Reading Gaol - Oscar Wilde)

1. ఆ రోజు అతను ఎర్ర కోటు వేసుకోలేదు
రక్తం, ద్రాక్షాసవం ఎర్రగానే వుంటాయి కదా
అప్పటికే అతని చేతులు ఆ రెంటితో తడిశాయి
అప్పుడే అతన్ని ఆమె ప్రక్కన చూశారు
అతని ప్రియురాలి ప్రక్కనే-
ఆమె శయనించిన ప్రక్కలోనే...
వాళ్లతన్ని పట్టుకున్నారు...

2. ఖైదీలతో నడుస్తున్నాడు
నలిగిపోయిన ఊదా బట్టల్లో
క్రికెట్ కాప్ నెత్తిన వుంది...
అడుగులు గాలిలో తేలిపోతున్నట్లు...
అంత ఆశగా చూసే వాడిని చూడలేదు
ఇప్పటివరకు అలాంటి వాడ్ని చూడనే లేదు

3. మేము, ఖైదీలం, ఆ కాస్త ఆకాశాన్ని-
అదే చిన్న పందిరిలా కనపడే నీలాన్ని-
అప్పుడప్పుడు తెల్ల మబ్బులు తరలి పోయే ఖాళీని-
ఆ ఆకాశాన్ని, అతను అంత ఆబగా చూశాడు...

4. మిగతా ఖైదీలంతా బాధగానే కదిలారు...
ఇది మరో వలయం, మరో లోగిలి!
ఏమిటి ఇతను చేసింది – చిన్న నేరమా?
ఏదైనా పెద్ద ఘోరమా?
అప్పుడు వినపడింది...
'అతన్ని ఉరి తీస్తారు...' అని.

5. అయ్యో! దేవుడా – ఈ ఖైదు గోడలన్నీ
కంపించి పోతున్నాయి
ఆ కాస్త కనపడే ఆకాశం–
కరిగే ఇనుములా మారిపోయింది
బాధలో వున్న నాకు–
ఇప్పుడు నొప్పి తెలియ లేదు?

6. ఇప్పుడే తెలిసింది – అతని ఆలోచనలే
అతని అడుగుల్ని తొందరపెడుతున్నాయి...
ఈ దుర్దినాన్ని అతడు ఉల్లాసంగా ఆ దృష్టితో ఎందుకు చూశాడో...
అతను ప్రేమించినదాన్నే నాశనం చేశాడు
చివరికి – అతనూ చనిపోవాలి!

7. ప్రపంచంలో ప్రతివాడు
తాను ప్రేమించినదాన్నే నాశనం చేస్తాడు...
కొంత మంది కోపంగా చూస్తూ
కొంత మంది మంచి మాటల్తో,
పిరికివాడు, ముద్దుపెడుతూ చంపుతాడు,
ధైర్యవంతుడు కత్తితో పొడిచి చంపుతాడు.

8. ఒకడు తన ప్రేయసిని యౌవనంలో,
ఇంకొకడు కాస్త వయసు మళ్లిన తర్వాత-
మరొకడు తను లాలించిన చేతుల్తో చంపుతాడు-
ఇంకొకడు ఆభరణాలిచ్చిన అరచేతుల్తో...
దయగలవాడు కత్తితో చంపుతాడు...
...చావు చల్లగా వుంటుంది.

9. కొంత మంది కొద్దిగా ప్రేమిస్తారు
కొందరేమో కొండంత...
కొందరు ప్రేమను అమ్ముతారు-
మరికొందరు కొంటారు..
కొందరు కన్నీళ్లతో కడతేరుస్తారు,
మరికొందరు నిట్టూరుస్తూ మట్టుబెడతారు...
కాని ప్రతివాడు తను ప్రేమించిన దాన్ని నాశనం చేస్తాడు
అయితే అందరూ చంపినందుకే చనిపోరు...

10. అతను సిగ్గుతో చనిపోడు...
అగౌరవం అనే అంధకారంలో,
కంఠాన్ని ఉరితాడు బిగించదు
ముఖాన్ని నల్ల గుడ్డ దాయదు
కాళ్ళక్రింద ఖాళీ చోటూ ఉండదు!

11. అతను మౌనంగా ఇతరులతో కూర్చోడు
అతన్నే అహోరాత్రులు చూసేవాళ్లలతో
అతని దుఃఖాన్ని పట్టించుకునే వాళ్లతో
అతని ప్రార్థనను వినేవాళ్లతో–
అతను తప్పించుకు పోతాడేమోనని
కాపలా కాసే వాళ్లతో...
ఎవరితోనూ అతను కూర్చోడు

12. అతను ఉదయాన్నే లేవడు–
వికారమైన ముఖాలు మూగుతుంటాయి,
తెల్లని రోబ్‌లో మతపెద్ద వణుకుతుంటాడు–
షెరీఫ్ విచారంతో బిగుసుకు పోతాడు
గవర్నరు – మెరిసే నల్ల బట్టల్లో
యమపాశంతో.. వస్తాడు

13. అతను ధైన్యంగా తొందరపడి లేవడు–
నేరస్తుని దుస్తుల్లోకి మారడు
ఇంతలో బొంగుర గొంతు వైద్యుడు గొణుగుతూ
అతని నాడి పరీక్షిస్తాడు, గడియారం టిక్‌టిక్ వింటూ–
అవి భయంకరమైన సుత్తి దెబ్బలు!

14. అతనికి దారుణమైన దాహం తెలియదు–
తలారి, చేతి తొడుగులతో
దళసరి తలుపు తీసుకుని వచ్చి
అతని గొంతుకు ఉరితాడు బిగించి
నపుడు ఇంక అతనికి దాహం వేయదనీ... తెలియదు!



15. అతను తల వంచడు,
అతని శవాన్ని పూడ్చి పెట్టేవాళ్ళు చదివే వివరాలు వినటానికి,
'నువ్వు చనిపోలేద'ని చెప్పే మనసు ఘోష వినడు...
అతని శవపేటిక దాటి ఉరికంబానికి
వెళ్ళేప్పుడూ అతను తలవంచడు..

16. పై కప్పు అద్దం లోనుంచి వచ్చే చిరు వెల్తురు చూడడు
ఎండిపోయిన పెదాలతో తన బాధను పోగొట్టమని
ఏ ప్రార్థనా చేయడు
అతని చెక్కిళ్లపై ఏ స్పర్శ లేదు–
Caiaphas పెట్టిన ముద్దు తాలూకూ స్పర్శా లేదు

# II

1. ఆరువారాలు ఈ వీర ఖైదీ తిరుగుతూనే వున్నాడు
అదే నలిగిన ఊదా సూటులో
ఎప్పుడు క్రికెట్ కాప్ తలమీదే,
అతని అడుగులు తేలికగా అలవోకగా పడుతూనే ఉన్నాయి
ప్రతిదినాన్ని ఆ విధంగా ఆశగా చూసిన వాడిని
నేనింతవరకూ చూడలేదు...

2. అలాంటి ఆశతో చూసే వాడ్ని ఇంతవరకు చూడలేదు
అదే చిన్నపాటి ఆకాశపు ఖాళీని,
ఖైదీలు ఆకాశం అని పిలుచుకునే దేరాని
అలా సాగిపోయే మబ్బుల చారలను
ఇష్టంగా చూసేవాడిని...నేను చూడనే లేదు.

3. అతను ఎప్పుడు చేతులు నలుపుకో లేదు,
ఏదో ఆశతో అంతరంగ నైరాశ్యాన్ని పోగొట్టుకోవటాన్కి
వెంపర్లాడే పిరికివాళ్లలాగా...
అతను చేతులు నలుపుకో లేదు,
వెలుగును చూస్తూ, ఉదయపు గాలులు ఆహ్వానిస్తూనే వున్నాడు.

4. అతను చేతులు నలుపుకోలేదు, ఏడ్వనూ లేదు
ఎగిసి పడలేదు – దిగులు పడనూ లేదు
ఆ ప్రొద్దుటి గాలిలో ఏదో సాంత్వన వున్నట్లు
అందులో మధువులు దాగి వున్నట్లు
నోటి నిండా వెలుగులు గ్రోలే వాడు...

5. జైలు బాధితులం,
దూరంగా నడుస్తుంటాం - మా లోకంలో
అతన్ని మరచిపోయి
త్వరలో ఉరితాడుకు వేలాడబోతున్న
అతన్ని విచారంగా, ఆశ్చర్యంతో చూస్తుంటాం...

6. అతను అంత తేలికగా నడవడం ఆశ్చర్యం
అతడు రోజును అంత తేలికగా చూడడం ఆశ్చర్యం
అతడు తీర్చవలసిన బాకీ తెలిస్తే, ఇంకా ఆశ్చర్యం

7. ఓక్-ఎల్మ్ చెట్లు, వసంతంలో చిగురుస్తున్నాయి
అతని కోసం ఉరికంబంగా మారిన
చెట్టును తలుచుకుంటే బాధ -
దాని కుళ్లిన వేళ్లు, పచ్చటిదో-చచ్చినదో చివరికి
అది పిందెలు వేయకుండానే అతన్ని చంపుతోంది!

8. అందరు కోరేది,
ప్రపంచ జీవులన్నీ అందుకోవాలనేది,
ఎత్తైన చోటు, గౌరవం కోసం,
కానీ, ఉరికంబం మీద నిలబడి
మెడచుట్టూ హంతకుని పట్టీతో
ఎవరు? ఆకాశం వంక చూస్తారు?



9. జీవితం–ప్రేమ హాయిగా వుంటే
శ్రావ్యమైన సంగీతానికి అడుగులు వేయవచ్చు
వేణు నాదానికి ఊగిపోనూవచ్చు –
సున్నితంగా సాగిపోనూవచ్చు
కాని చల్లబడిన పాదాలు గాలిలో ఊగడం
ఎంత దారుణం!

10. బాధగా, బరువుగా అనుమానంగా
అతన్ని రోజు రోజూ చూస్తూనే వున్నాం–
మేముకూడా ఇలాగే అంతమైపోతామా అని ఆశ్చర్యం
ఎవరు చెప్పగలరు, నిప్పులు చెరిగే నరకంలో
చీకటి ఆత్మలు ఎటుపోతాయో?

11. చివరికి అతను ఖైదీలతో కనబడలేదు,
చనిపోయినవాడు నడవలేదు కదా,
నాకు తెలుసు అతను ఉరికంబం క్రింది
చీకటి గోతిలో నిలబడి వుంటాడని–
ఇకముందు అతని ముఖం నాకు
ఈ అందమైన లోకంలో కనపడదని–



12. తుఫాను గాలుల్లో మునిగిపోయే పడవల్లా,
రోజూ మేము ఎదురుపడేవాళ్లం
ఏ మాటా లేకుండా – ఏ గుర్తూ రాకుండా!
ఏముంది మాట్లాడేందుకు?
మేమేమైనా పవిత్రమైన రాత్రిలో కలిశామా?
సిగ్గులేని పగటి వెల్తుర్లో కదా!

13. మా యిద్దరి చుట్టు జైలు గోడ ఉంది
వెలివేయబడిన వాళ్లంకదా–
ఈ ప్రపంచం మమ్మల్ని తోసివేసింది–
దేవుడు తన దయ తప్పించాడు
పాపపు కాఠిన్యం తన క్రూర రంపపు కోరల్లో
పట్టుకుంది

## III

1. 'డెటర్' పెరడులో రాళ్ళు చాలా కఠినం,
జారుడు గోడ ఎంతో ఎత్తు,
అదిగో అక్కడే అతను, చీకటి ఆకాశం క్రింద
ఆరు బయటకు నడిచాడు
ఇరుప్రక్కలా వార్డులు కాపలా,
ఉరికి ముందు అతను చావకుండా!

2. అతని పరితాపాన్ని గమనించి
చుట్టూ చేరిన వాళ్లతో కూర్చునే వాడు...
అతను దుఃఖించేప్పుడు చూసేవాళ్లు-
ముడుచుకొని ప్రార్థించే సమయంలో
అతన్ని కాపలా కాసేవాళ్లు - ఎందుకు?
ఉరికంబానికి ఎర కాకుండా పోతాడేమోనని!

3. గవర్నరు చట్టాన్ని అమలు పరచడంలో దిట్ట,
వైద్యుడు, చావును శాస్త్రపరమైన సత్యం అంటాడు
మత పెద్ద రోజుకు రెండుసార్లు
నరకాన్ని తప్పించమని ప్రార్థిస్తుంటాడు

4. రెండుసార్లే - పైపుతో పొగపీల్చేవాడు
అతని బీరు కోటా లాగించేవాడు
దృఢ నిశ్చయంతో, భయం లేకుండా పలికేవాడు
'నాకు సంతోషంగా వుంది, చావు దగ్గరకొస్తోంది'

5. కానీ ఇంత వింతగా ఎందుకంటున్నాడు
ఎవ్వరికీ అడిగే ధైర్యం లేదు
బాధ్యత నెరవేర్చే వాడు నోరు మూసుకోవాలి,
ముఖానికి ముసుగు వేసుకోవాలి,

6. లేదంటే - అతనిలో దయ మేల్కొంటుంది
ఖైదీని ఓదార్చాలనిపిస్తుంది
మానవ మాత్రమైన కరుణకు
హంతకుల గుహలో చోటెక్కడ?
సాటివాని ఓదార్పుకు మాటెక్కడ?

7. అధోముఖులమై తిరుగుతున్నాం
మూర్ఖుల్లా స్వర్గంలో వున్నట్లు...
మాకు లెఖ్ఖేమిటి? మేము సైతాను సైన్యం!
బోడి తలలతో, మారు ముఖాలతో ఊరేగుతున్నాం.

8. తారు తాళ్లను ముక్కలు చేశాం,
వేళ్లు, గోళ్లు రక్తం కారుతుంటే,
తలుపులు రుద్ది, నేలను శుద్ధి చేశాం
గొట్టాలన్నీ మెరిసేట్లు తుడిచాం
బల్లలన్నీ సబ్బుతో గబ్బు పోగొట్టాం
మాని ముంతలను మోగించాం...

9. బొంతలన్నీ కుట్టాం - రాళ్లన్నీ పగలగొట్టాం-
దుమ్మురేపే మరలు తిప్పాం, రేకులు కప్పాం,
మంత్రాలు వల్లించాం, మిల్లులో చెమటలు కక్కాం
ఇన్ని చేసినా మా గుండెల్లో భయం పోలేదు!

10. ఆ భయం అలాగే పాకుడు మొక్కలా పాకింది,
చివరికి మాలాంటి మోసగాళ్ల కోసం
ఏ చేదు నిజం దాగిందో మరిచిపోయాం,
ఆ రోజు తవ్వి వున్న బొంద చూసేవరకు...

అది పసుపు పచ్చని నోరు తెరిచి
ప్రాణిని మింగేందుకు వేచి వుంది...
జిగటుగా వున్న దాని అంచులు – దాహంతో అరుస్తున్నాయి
అక్కడి బురద, నెత్తురు కోసం బుడ బుడమంటోంది!
అప్పుడు తెలిసింది – తెలవారక ముందే
ఓ ఖైదీ – ఆ దూలానికి వేళ్లాడతాడని...

11. అలాగే లోపలికెళ్లాం – చావు భయంతో
చచ్చిపోతూ...
తలారి తన చిన్న సంచితో
ఆ చీకట్లో తారట్లాడుతుంటే–
ప్రతివాడు వణికిపోతూ
తన సమాధిలోకి,
అదే, తనకు కేటాయించిన సమాధిలోకి వెళ్లిపోయాడు!

12. ఆ రాత్రి – ఆ ఖాళీ వరండాలన్నీ
అన్నిరకాల భయంతో నిండిపోయాయి
పైనా క్రిందా – ఆ ఇనప కోటలో
అడుగులు వినపడుతున్నాయి,
ఆ ఇనప జల్లెడలోంచి చుక్కలు కనపడవు
పాలిపోయిన ముఖాలు పైకి చూస్తూనే ఉన్నాయి...

13. అతను పడుకునే వున్నాడు,
కలలు కంటూ...
పచ్చని బయలు ప్రదేశంలో హాయిగా,
కాపలావాళ్లు – అతను నిద్రపోవటం
చూస్తూనే వున్నారు, అయోమయంగా
ఎవరయినా అంత హాయిగా ఎలా నిద్రపోతారు
చావు తన ప్రక్కనే వుండగా?

14. కానీ, ఏడ్చేవాళ్లకు నిద్రపట్టదు
ఇప్పటి వరకూ ఏడుపు రాని వాళ్లకూ నిద్రపట్టదు..
మేము – మూర్ఖులం, మోసగాళ్లం, మాయగాళ్లం–
మేల్కొనే కాపలా కాస్తున్నాం–
మా బుర్రలో భయాలు బాధలూ
భయంకరంగా కమ్ముకున్నాయి

15. అయ్యో – ఇది ఎంత భయంకరం!
మరొకరి తప్పుకు బాధపడడం–
అందులోనే పాపపు కత్తి
చివరికంటా విషంతో దిగిపోతుంది
సీసం కరిగినట్లు – మా కన్నీళ్లు కారుతున్నాయి –
ఇంక నెత్తుటి బొట్లు ఎక్కడివి?

16. వార్డర్లు మెత్తటి బూట్లతో గుమ్మాలు దాటి వస్తూ,
తలుపులు తాళం తీస్తున్నారు –
తొంగి చూసి తెల్లబోయారు
నేలను తాకి చీకటి బొమ్మల్లా
అంతమంది ప్రార్థన చేస్తున్నాం!
ఇలా ఎప్పుడూ లేదే – ఆశ్చర్యం!

17. అవును ఆ రాత్రంతా మేము వంగి ప్రార్థిస్తూనే
పిచ్చిగా ఏడుస్తున్నాం - శవ జాగరణలో,
అర్థరాత్రి - తురాయిలన్నీ తిరుగుతున్నాయి
శవపేటిక మీద తురాయిలు పరుచుకున్నాయి
స్పాంజ్ మీద చేదు వైను!
ఇదా అనుతాపానికి అనుపానం?

18. నల్ల కాకి అరిచింది - ఎర్ర పుంజు కూసింది!
ఇంకా వెలుతురు రాలేదు -
ఎప్పటికీ తెలవారలేదు-
అంతులేని భయాలు వికృతంగా చేరాయి-
మేము పడి వున్న మూలల్లో
పాపిష్టి దెయ్యాలన్నీ
ఇక్కడే తిరుగుతున్నాయి...

19. ఇక్కడే పరుగెడుతున్నాయి -
పొగమంచులో యాత్రికుల్లా -
చందమామను వెక్కిరిస్తూ తైతక్క లాడుతూ -
సుతారంగా తిరుగుతూ మెలికలు పోతూ
అసహ్యమైన అందంతో - వింత వేగంతో
మాయ భూతాలు మార్మిక సంకేతాలతో

20. పొగమంచులో చెట్టపట్టాల్ వేసుకుని
చెత్తా చెదారాలతో దెయ్యాలు కదిలి పోతున్నాయి-
తిరిగి తిరిగి - సుడి తిరుగుతూ - తకధిమి ధిమతకా అంటూ!
ఈ భూతాలు వికృతంగా ముగ్గులు వేస్తూ తిరుగు తున్నాయి...
ఎడారి గాలి, ఇసుక మీద నడిచినట్లు...

21. మునివేళ్లపై గిరికీ లాడుతూ
భయంకరమైన ఈలతో 'గీ' పెడుతూ
వికారమైన ముసుగుతో కదుల్తూ
పెద్దగా అరుస్తూ, దీర్ఘాలు తీస్తూ
పాడుతున్నాయి –
చచ్చిన వాళ్లను లేపేందుకు...

22. 'ఓహెరా' అంటూ అరుస్తున్నాయి –
సంకెళ్లతో కాళ్లూ చేతులూ చచ్చుబడ్డాయి,
ఒకటికి రెండుసార్లు పాచికలాట
ఏదో ఆడాలి కదా – కాని అతను గెలవ లేదు
అతను ఆడేది సైతానుతో–
అదీ, చీకటి రహస్యపు గదిలో!



23. గొలుసుల రాపిడితో గాయాల బ్రతుకులు
ఇవి ఇంకా పచ్చిగా వున్న పుళ్లు
సంకెళ్ల కాళ్లకు స్వేచ్ఛ రాదు
ఆహో! క్రీస్తు గాయాలు ఇంకా రక్తం ఓడుతూనే వున్నాయి
ఎంత భయంకర దృశ్యం!

24. సుడులు తిరుగుతూ - వికృత నృత్యం చేస్తూ
జంటలు జంటలుగా, తొక్కిసలాడుతూ-
మెట్లపైకి ఎగురుతూ - వికారంగా భయంకరంగా
మా ప్రార్థనలకు భూతాలు సాయం చేస్తున్నాయి.

25. అప్పుడే ఉదయపు గాలులు ఏడుస్తున్నాయి
అయినా ఇంకా చీకట్లు పోలేదు
భయంకరమైన గూడులా విషాదం అల్లుకుంటుంది,
దారాలన్నీ బిగిసిపోతున్నాయి
మా ప్రార్థనలన్నీ భయంతో నిండుతున్నాయి
వెలుగురాయుడు తెచ్చే శిక్ష కోసం...



26. మూలుగుతున్న గాలి సుడులు తిరుగుతోంది
జైలు గోడలు దుఃఖిస్తున్నాయి
క్షణాలు దొర్లిపోతున్నాయి
ఓ చిరుగాలీ! ఎందుకేడుస్తావు
మేము ఏ పాపం చేశాం? ఇలాంటి జైలర్నిచ్చావు?

27. నీడలా కనపడుతున్న చువ్వలు
లోహంతో అల్లిన జల్లెడలా
ఆ తెల్లని గోడకివతలగా
మా మూడంచెల మంచాలకెదురుగా
అప్పుడే తెలిసింది – ఎక్కడో భూమ్మీద
ఎర్రగా భయపెడుతూ ఉదయిస్తోందని...

28. ఆరు గంటలకు మా గూళ్ళు కడిగాం
ఏడు గంటలకు అంతా నిశ్శబ్దం!
కాని బలమైన రెక్కల తాకిడితో
ఖైదు నిండి పోయింది
యముడు శీతల శ్వాసతో
చంపటానికి వస్తున్నాడు!

29. అతను సిగ్గుతో ఎర్రబడి పోలేదు
భయంతో పారిపోలేదు
మూడు గజాల తాడు – ఒరిగిపోయే బల్ల
ఇవేగా ఉరికి కావల్సింది!
బిగువైన తాడుతో తలారి వచ్చాడు
రహస్య కార్యాన్ని పూర్తిచేసేందుకు!



30. చిత్తడి నేలమీద చీకటిలో తచ్చాడుతూ
ప్రార్థన కోసమైనా శ్వాసించాలంటే
భయపడుతున్నాం
మా విషాదాన్ని పోగొట్టాలంటే
మాలో ఏదో చనిపోయింది
ఆ చనిపోయింది - ఆశ
అవును! ఆశా చచ్చిపోయింది!!

31. మనిషి చేసిన చట్టం
ప్రక్కదారి పట్టదు
బలహీనుల్ని చంపివేస్తుంది - బలవంతుల్నీ వదిలి పెట్టదు
దాని అడుగులు భయంకరమైనవి -
ఇనప పాదాలతో తొక్కుకుంటూ వెళ్లిపోతుంది...

32. ఎనిమిది ఎప్పుడు కొడుతుందా అని ఎదురు చూశాం
మా నాలికలు పిడచగట్టి పోతున్నాయి
ఎనిమిది కొడితే అది చావు దెబ్బ!
అప్పుడే అతని శిక్ష అమలవుతుంది
విధి-ఉరిని బిగిస్తుంది,
మంచివాడికైనా చెడ్డవాడికైనా!

33. మాకు ఏమి చేయటానికీ తోచలేదు
ఆ క్షణం కోసం చూడటం తప్ప
లోయలో రాళ్లలా కూర్చున్నాం
నిశ్శబ్దంగా-స్తబ్దంగా
మా గుండెలు దడ దడ కొట్టుకుంటున్నాయి

పిచ్చివాడు డోలు వాయిస్తున్నట్లు!

34. ఒక్కసారిగా జైలు తాళపు శబ్దం
గాలిలో వణుకుతూ తేలి వచ్చింది
ఒక్కసారిగా జైలు ఉలిక్కి పడింది
కుష్ఠువాడు–తన గూటిలో విన్నట్లు!
నిరాశా నిస్పృహలతో నిండి
ఎముకలు పిండి అవుతున్నట్లు...

35. భయంకరమైన దృశ్యాలు
కలల్లోనే చూసినట్లు
ఆ మెరుస్తున్న తాడుని చూశాం,
అది నల్లటి దూలానికి కట్టి ఉంది
అప్పుడు తలారి గొణుగుతున్న చివరి ప్రార్థన...
ఒక్కసారిగా గొంతు బిగిసిన కేక విన్నాం...

36. ఇన్నాళ్ల బాధ ఒక్కసారిగా అతని అరుపులో...
వికృతమైన వేదన - నెత్తురోడుతున్న చెమటలు
నాకు తెలిసినట్లు మరొకరికి తెలియదు
ఎన్ని జీవితాలనో గడిపినవాడు
అన్నిసార్లు చావాలి కదా!

* * *

## IV

1. అతన్ని ఉరి తీసిన రోజు
ఏ ప్రార్థనాలయం తెరిచి లేదు...
మతాచారి మనసు బేలగా,
ముసలి ముఖం పాలిపోయి,
బహుంశా, అతను కళ్లు సిగ్గుతో మూతపడ్డాయేమో!

2. మాకు మధ్యాహ్నం దాటింది
అప్పుడు గంట మోగింది
గలగల తాళాల మోతలో
జైలు గదులు తెరుస్తున్నారు
మా ప్రైవేటు నరకాలు వదిలాం
ఇనప మెట్లు తొక్కుతూ...



3. దేవుని శ్వాసలాంటి చల్లగాలిలోకి,
ఆరుబయటకు దూకాం – అయిష్టంగానే...
ఒకడు భయంతో పాలిపోయాడు–
మరొకడు నల్ల పోర వేశాడు–
అంతటి విచారంలోనూ, ఆశగా చూశాం!
ఆ కాస్త ఆకాశాన్ని...

4. అంత విచారంలో ఆశగా చూసినవాళ్లను..
ఇంత వరకూ చూడలేదు
ఆ చిన్న పందిరిలాంటి ఆకాశం,
అదే మేము ఆకాశం అని పిలిచే డేరా
నిర్లక్ష్యంగా కదిలే మబ్బులు...
వాటికి ఎంత స్వేచ్ఛ!

5. మాలో అందరికీ తెలుసు–
కింది చూపుల్తో నడుస్తూ
ముందు ముందు మా రాత ఎలా వుందో...
మాకంటే ముందు అతన్ని చంపారు!
అతను ప్రేమించిన దాన్ని చంపాడు
వాళ్లు? చచ్చిన వాణ్ణి చంపారు!

6. రెండవసారి పాపం చేసి
మరణించిన ఆత్మను బాధపెట్టాలా?
పొగమంచు పొరల్లోనుంచి లాగి
మళ్లీ నెత్తురు కార్చాలా?
ఎంత రక్తం ఒలికినా
ఏమి ఉపయోగం?

7. తోకలు ముడిచిన కోతుల్లా
తిరిగిన చోటే తిరిగాం –
నోరుమూసుకుని, ఆ జారుడు నేలమీద,
ఒక్కళ్లు మాటాడితే ఒట్టు...

8. మౌనంగా మళ్లీ మళ్లీ తిరిగాం,
అందరి మనసుల్లో భయం మరుగుతోంది
భయంకరంగా జ్ఞాపకాలు ముసురుతోంటే,
చలిగాలి కరుస్తున్నట్లు
భయం మా ముందు నిలబడితే
వెన్నులో వణుకు పుట్టింది

9. కాపలావాళ్లు కాలుగాలినట్లు
మూర్ఖులు చుట్టూ మూగుతూ
ఫెళ ఫెళలాడే యూనిఫారాల్లో
ఆదివారపు కోట్లలో
మాకు తెలుసు వాళ్లు చేసిన
భయంకరమైన దారుణం
వాళ్ల బూట్లమీది సున్నపు మరకల సాక్షిగా

10. అంతకు ముందు నోరు తెరిచిన బొంద,
ఇపుడు మూత పడింది
ఇంత బురద, ఇంత ఇసుక! అంతే
వికృతమైన జైలు గోడ ప్రక్కన
బూడిద కుప్ప కూర్చుంది
బహుశా అక్కడే అతన్ని దహనం చేసింది

11. అక్కడే అతని ఆరిన చితి మీద 'పోర్వ' ఉంది
ఈ విశాలమైన జైలు ఆవరణలో ఓ మూల,
అవమానపు దిగంబరత్వం!
మంటలు చుట్టి వేస్తుంటే
కట్టిన కాళ్లతో పడివున్నాడు!

12. చితిమంటల్లో చర్మం,
చిదుగులు కాలిపోతూంటే
ఎముకలన్నీ చిటపటమంటాయి రాత్రిలో...
మాంసపు ముద్ద మార్దవం పగటిలో...
మంటల నాల్కలు బొందిని తినేస్తాయి
గుండె మంటలు – గుండెను తింటాయి!

13. మూడేళ్లు అక్కడ ఏ విత్తనం నాటరు
మూడేళ్లు అది బీడుగానే మిగిలి
ఆకాశం వంక దిగులుగా చూస్తూ
బీటలువారి పోతుంది...

14. విత్తనం వేస్తే ఒక వేళ
నిందితుడు లేచి వస్తాడా?
అది నిజం కాదు – చల్లని భూమాత,
ఈ మనుషులకంటే దయగలది
గులాబీ మరింత ఎర్రగా మండుతుంది!
తెల్లని పూవు మరింత తెల్లబోతుంది!

15. అతని నోట్లోంచి ఎర్రని గులాబి–
అతని మనసులోంచి తెల్లని పూవు!
ఎవరికి తెలుసు...
క్రీస్తు అతనికి ఎలాంటి వెలుగునిస్తాడో...
**పుణ్యక్షేత్రాలు దర్శించేవాడి చేతికర్ర**
**ఏ పుణ్యమూర్తి చూపుసోకి చిగురిస్తుందో!**



16. జైలు గాలిలో ఏ పూవు పూయదు
వీళ్లిచ్చేవి చిల్లపెంకులూ గులకరాళ్లు
బండలౌతున్న గుండెలు!
ఇవే మాకు గతి–
పూలయితే గాయాలు మాన్పుతాయి గదా!

17. ఈ జైలు వాతావరణంలో ఏ పూవు పూయదు
పూసినా రేకులన్నీ రాలి పోతాయి
అదే... ఆ జైలు గోడ మూల... బురదలో... ఇసుకలో...
ఇక్కడ తిరిగే వాళ్లకు తెలియాలని,
అందరి కోసం దేవుని పుత్రుడు చనిపోయాడని...

18. ఇప్పటికీ జైలు గోడలు అతన్ని చుట్టి వున్నాయి
ఆత్మలు రాత్రి కూడా తిరగవు
ఈ పాపిష్టి ఆవరణలో ఆత్మలూ బందీలే
దుఃఖిస్తూ పడి వుంటాయి!

19. అతను ప్రశాంతంగానే వున్నాడు
త్వరలోనే అతనికి శాంతి దక్కింది
అతన్ని ఇక ఏదీ ఇబ్బంది పెట్టదు
పగలు సెగలు కాయదు,
అతను వున్న చీకటి గుహలో
రాత్రి లేదు – పగలు లేదు.

20. అతన్ని జంతువులా బలి యిచ్చారు
కనీసం ముందుగా చెప్ప లేదు
మంగళం కూడా పాడ లేదు
అతని ఆత్మకు శాంతి చేకూరేదేమో
తరుముతున్నట్లు తీసుకుపోయి
చీకటి గోతిలో దాచారు!

21. అతని ముతక బట్టలూడదీశారు
పురుగు పుట్రకు వదిలేశారు
ఉరితాడుతో ఉబ్బిన గొంతు
పొడుచుకు వచ్చిన గుడ్లను
ఎగతాళి చేశారు
ఇక ఇకలు పక పకలతో – మట్టి తోశారు
ఆ గుంటలో నిందితుడు పడివున్నాడు
అపవిత్రమైన స్థానంలో...

25. అతని బూడిద వున్న బొంద పక్కన
మతాచారి వచ్చి ప్రార్థన చేయడు...
పాపులకోసం వెలసిన శిలువతో
ఆశీర్వాదం ఇవ్వడు...
కాని ఇలాంటి వాళ్లకోసమే కదా
క్రీస్తు శిలువ ఎక్కింది!!

* * *



# V

1. ఈ చట్టాలు మంచివో, చెడ్డవో
నాకెలా తెలుస్తుంది
కాని ఈ జైలు గోడ చాలా – ఎత్తైనది, రాటుదేలింది!
ఇక్కడ ఒక రోజు ఒక్క సంవత్సరం!
ఎన్నో నిఘా దినాలున్న సంవత్సరం అది!!

2. కాని మనిషికోసం మనిషి చేసిన చట్టం
అప్పటి నుంచి...
మొదటి మనిషి తన చుట్టాన్ని
ప్రాణాలు తీసినప్పటి నుంచి...
ఈ దుఃఖితలోకం మొదలయింది...
గింజలు ఉంచి, పొల్లును
దుర్మార్గపు గాలితో తూర్పారబట్టినట్లు...

3. కాని ఇది నిజం–
ఈ నిజం అందరూ తెలుసుకోదగింది
ప్రతి జైలు, సిగ్గులేని ఇటుకలతో కట్టబడింది
ఇనుప చువ్వలతో చుట్టబడింది
ఎందుకు?
ఒకవేళ క్రీస్తు చూస్తాడేమోనని,
మనుషులు సాటివాణ్ణి
వెలిగా వుంచటం పరికిస్తాడేమోనని...

4. రమణీయమైన చంద్రుణ్ణి
రంపపు చువ్వలతో కనపడనీయరు
సూర్యుణ్ణి గుడ్డివాణ్ణి చేస్తారు
లోపలి నరకాన్ని దాయటానికి
అన్ని జాగ్రత్తలు తీసుకుంటారు
అందులోనేకదా దారుణాలు జరిగేది!
దేవుని పుత్రుడైనా – మనిషి కుమారుడైనా
చూస్తాడేమోనన్న భయంతో.

5. ఇక్కడే కదా – దుర్మార్గపు కలుపు
పెరిగి – గాలిని విషపూరితం చేస్తుంది!
ఇక్కడే కదా – మనిషిలోని మంచి
వృథా అయి ఎండి పోతుంది
పాలిపోయిన దుఃఖం – బరువైన తలుపులు మూస్తుంది
కాపలాదారుణ్ణి దిక్కులేని వాణ్ణి చేస్తుంది!



6. భయపడిన వాళ్లు బిక్కచిక్కి పోతారు
రాత్రి పగలు, పొగిలి పొగిలి...
బలహీనుల్ని కొరడాతో కొడతారు -
మూర్ఖుల్ని బెత్తాలతో బాదుతారు
పండు ముసలివాళ్లనీ పరిహాసం చేస్తారు
కొందరు పిచ్చివాళ్లుగా - కొందరు చచ్చినవాళ్లుగా
మారిపోతారు,
కాని అందరూ నోళ్ళు మూసుకుంటారు.

7. ఈ ఇరుకు మురికి గది
ఉచ్చల కంపు
దుర్గంధం, శ్వాసను చంపుతుంది
మనుషుల యంత్రాలతో
ఊపిరాడని జల్లెడ తెరల్లో...
కోరిక తప్ప, అంతా దుమ్ముగా మారిపోతుంది

8. మేము తాగే ఉప్పునీళ్లు,
జిగటగా గొంతు జారతాయి
వాళ్లు తూచి ఇచ్చే చేదు రొట్టె,
అదంతా - సున్నమూ-సుద్దా!
ఇంక నిద్ర - నిలబడే కళ్లు మూసుకుని,
తిరుగుతుంటుంది- కాలపు అగాధంలో కేకలు పెడుతూ-

9. ఆకలి పీలగా - దాహం పేలవంగా
తాచుపాము కట్లపాముతో పోట్లాడుతున్నట్లు
జైలులో ఏం జరిగినా - మాకు లెక్కలేదు-
ఇక్కడ చలికీ - చావుకీ తేడా లేదు-
పగలు మేము మోసిన ప్రతి బండా
రాత్రి మా గుండెగా మారిపోతుంది

10. ప్రతివాడి గుండెలో అర్థరాత్రే-
ప్రతి గదిలో సాయంకాలమే-
యంత్రం తిప్పినా - తాడు పేనినా-
ఎవరి నరకం వాడిదే-
నిశ్శబ్దం అందనంత దూరం
సిగ్గుమాలిన గంట మోతకంటే

11. దగ్గర్లో ఎప్పుడు దయగలవాని
మాట వినపడదు-
కాపలా కాసే కన్ను కర్కశమైంది
అందరూ మర్చిపోయిన మేము
క్రుంగి కృశించి కుళ్లిపోతాం

12. ఆ విధంగా మా జీవితం తుప్పుపట్టి
రాలిపోతుంటుంది పొరలుగా,
కొందరు శపిస్తుంటారు - కొందరు తపిస్తుంటారు
కొందరు స్తబ్దంగా మిగిలిపోతారు
దేవుని ప్రకృతి సూత్రాలు గొప్పవి
మా బండల్లాంటి గుండెలు పగులుతుంటాయి!

13. గోడల లోపల-
ఇనప చట్రాల్లో పగిలిన హృదయం
ఆ దేవునికి సమర్పించబడిన నిధిలాంటిది!
అదే కుష్ఠువాని గూటిని
రసి మాంసపు వాసనతో నింపుతుంది

14. ఎవరి హృదయం పగిలిపోతుందో
వాడు అదృష్టవంతుడు -
ఎందుకో తెలుసా? అందులో శాంతి, క్షమ వుంటాయి
లేకపోతే అతని పాప ప్రక్షాళన ఎలా జరుగుతుంది?

**హృదయం పగలక పోతే కరుణామయుడు
అందులోకి ఏ విధంగా ప్రవేశిస్తాడు?**

★ ★ ★

15. ఉరితాడుతో ఉబ్బిన గొంతు
పైకి ఉలికి చూస్తున్న కళ్లు
తనని స్వర్గానికి తీసుకువెళ్లే
చేతులకోసం వేచి వున్నాయి...
పశ్చాత్తాపంతో పగిలిన హృదయాన్ని
దయామయుడు మరచిపోడు



16. ఎర్రబట్టల్లో చట్టాన్ని చదివేవాడు
అతనికి మూడువారాల సమయం అన్నాడు
కేవలం మూడువారాల బ్రతుకు
తనుచేసిన పాపాలు కడుగుకోవటానికి,
తన హృదయాన్ని ఓదార్చుకోవటానికి
తన చేతులకయిన నెత్తురు తుడుచుకోవటానికి
కేవలం మూడువారాలు!

17. నెత్తుటి కన్నీటితో తన చేతిని కడిగాడు
కత్తిపట్టిన చేతిని తుడిచాడు
రక్తమే కదా రక్తాన్ని తుడిచి వేస్తుంది!
కన్నీళ్లు గాయాలు మాన్పుతాయి.
ఆ ఎర్రని మరక అదే Cain మరక
క్రీస్తు వేసిన తెల్లటి ముద్రగా మిగిలింది

## VI

1. ‘రీడింగ్’ నగరం లో, ‘రీడింగ్’ జైలు లో
అవమానపు గొయ్యి వుంది
అందులో ఓ దౌర్భాగ్యుడు పడి వున్నాడు
నిప్పు కోరల్లో నలిగిన వాడు
మంటల తెరల్లో కాలిన వాడు,
అతని సమాధి మీద ఏ పేరూ లిఖించి లేదు...

2. అక్కడే...
క్రీస్తు మరణించిన వాళ్లను పిలిచే వరకు,
అతన్ని నిశ్శబ్దంలో వుండనివ్వండి
అతని కోసం కన్నీటి బొట్టు వృథా చేయకండి...
నిట్టూర్పు విడవకండి,
అతను తాను ప్రేమించిన దాన్నే చంపాడు-
ఇంక అతనూ చావాలి కదా!

3. అందరూ తాము ప్రేమించిన దాన్నే చంపుతారు,
కాని...
కొందరు విషదృక్కుల్తో...
కొందరు పొగడ్తలతో...
పిరికివాడు – ముద్దుపెడుతూ మట్టుపెడితే
ధైర్యవంతుడు, కత్తితో చంపుతాడు!

• • •

*అను సృజన:* **అశ్వినీకుమార్**




దుర్మార్గుడు మాటల్తో చంపుతాడు
దయగలవాడు కత్తితో చంపుతాడు...